www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 15 డిసెంబర్ 2023 | 5 | ఏలూరు



నేవీ యుద్ధ సామగ్రి ఏర్పాటుకు భూసేకరణ ఆపాలి

జీలుగుమిల్లి: మండలంలోని వంకవారిగూడెం పంచాయతీలో నేవీ యుద్ధ సామగ్రి డిపో ఏర్పాటుకు సంబంధించి భూసేకరణ పనులను తక్షణం నిలుపుదల చేయాలని జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ కె.అద్దయ్యకు సిపిఎం, గిరిజన సంఘాల నాయకులు ఆధ్వర్యంలో గురువారం వినతిని అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ ఇటీవల వంకవారిగూడెం పంచాయతీ కార్యాలయంలో జరిగిన గ్రామసభలో చుట్టుపక్కల ఐదు గ్రామాల ప్రజలు పాల్గొని తమ ప్రాంతంలో నేవీ యుద్ధ సామగ్రి డిపో ఏర్పాటు తగదని వ్యతిరేకంగా తీర్మానం రాసి పంచాయతీ కార్యదర్శి, తహశీల్దార్ సమక్షంలో సంతకాలు పెట్టి ఇచ్చారని తెలిపారు. యుద్ధ సామగ్రి డిపో ఏర్పాటుకు సంబంధించి భూ సేకరణ పనులను కూడా తక్షణం నిలుపుదల చేసేలా చర్యలు తీసుకోవాలని ఆర్‌డిఒను కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, మండలాల నాయకులు తెల్లం దుర్గారావు, తెల్లం రామకృష్ణ, జీవరత్నం పాల్గొన్నారు.

'ప్రభుత్వం మరోసారి కౌలురైతులకు అన్యాయం చేయనుందా.. మిచౌంగ్ తుపానుకు దెబ్బతిన్న పంటల పరిహారం కౌలురైతులకు అందని ద్రాక్షగానే మారనుందా.. సాగుచేయని భూయజమానుల జేబుల్లోకే పంటల పరిహారం చేరనుందా' అంటే అవుననే సమాధానం వస్తోంది. పంట నష్టపరిహారం అంచనాలకు సంబంధించి ప్రభుత్వం జారీచేసిన ఆదేశాలు అందుకు అద్దంపడుతున్నాయి. ఇ-క్రాప్ ఐడి నమోదు ఆధారంగా పంట నష్టపరిహారం పేర్లు రూపొందించాలని చెప్పడంతో కౌలురైతులకు అన్యాయం జరిగే పరిస్థితి ఏర్పడింది. ఒకరైతుకు ఐదెకరాల వరకు మాత్రమే పంట నష్టపరిహారం ఇస్తామని చెప్పడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



మిచౌంగ్ తుపాన్‌కు చింతలపూడి మండలంలో నేలకొరిగిన వరిపైరు(ఫైల్)

కౌలురైతులకు
పరిహా(రం)సమేనా..!

ఇ-క్రాప్‌లో పేరుంటేనే పరిహారం
కానీ భూయజమానుల పేర్లే ఇ-క్రాప్‌లో నమోదు
ఖరీఫ్ సాగులో 80 శాతం కౌలురైతులదే
ఐదెకరాల వరకు మాత్రమే పంటనష్టం
ఉమ్మడి జిల్లాలో 1.50 లక్షల ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు
26 వరకూ పూర్తిస్థాయి అంచనాల జాబితా విడుదలకు ఆదేశాలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో దాదాపు మూడు లక్షల మంది వరకూ కౌలురైతులున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. రెండుజిల్లాలవ్యాప్తంగా ఖరీఫ్‌సాగులో 80 శాతం కౌలురైతులే సాగుచేశారు. పంట చివరి దశలో విరుచుకుపడిన మిచౌంగ్ తుపాను దెబ్బకు రెండు జిల్లాలోనూ భారీగా పంటనష్టం ఏర్పడింది. ప్రాథమిక అంచనాల ప్రకారం వరితోపాటు, వివిధ పంటలకు సంబంధించి ఏలూరు జిల్లాలో 85,425 ఎకరాలు, పశ్చిమగోదావరి జిల్లాలో 68వేల ఎకరాలు మొత్తం లక్షా 50వేల ఎకరాల్లో పంటనష్టం వాటిల్లినట్లు తేలింది. ఎన్యూమరేషన్ ప్రక్రియ ప్రస్తుతం కొనసాగుతోంది. దెబ్బతిన్న పంటలను కేంద్ర బృందాలు సైతం పరిశీలన చేస్తున్నాయి. ఈనెల 26వ తేదీకి దెబ్బతిన్న పంటలకు సంబంధించిన తుది జాబితాను విడుదల చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఎన్యూమరేషన్ ప్రక్రియకు సంబంధించి ప్రభుత్వం జారీచేసిన ఆదేశాలు కౌలురైతులను తీవ్రంగా దెబ్బతీసేలా ఉన్నాయి.

ఇ-క్రాప్ ఆధారంగానే పరిహారం

దెబ్బతిన్న పంటలకు సంబంధించి అందించే పరిహారం ఇ-క్రాప్ ఆధారంగా జరగాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఇ-క్రాప్ ఐడి ఆధారంగానే జాబితా తయారు చేయాలని తెలిపింది. ఇ-క్రాప్‌లో భూయజమానుల పేర్లు తప్ప కౌలురైతుల పేర్లు లేవని అందరికీ తెలిసిందే. దీంతో పంటనష్టపరిహారం నమోదులో కౌలురైతులకు తీవ్ర అన్యాయం జరిగే పరిస్థితి నెలకొంది. కౌలురైతులు ఎకరాకు రూ.35వేలకుపైగా పెట్టుబడులు పెట్టారు. చేతిదాక వచ్చిన పంట వర్షార్పణమైంది. పలుచోట్ల పంటలను ట్రాక్టర్లతో దున్నించేస్తున్న పరిస్థితి ఏర్పడింది. ఈ పరిణామాలు కౌలురైతులకు కోలుకోలేని దెబ్బగా చెప్పొచ్చు. కౌలురైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం అందుకు విరుద్ధంగా ముందుకు సాగుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం చూస్తే పంటనష్టపరిహారం జాబితాలో భూయజమానుల పేర్లు తప్ప, కౌలురైతుల పేర్లు ఉండే అవకాశం లేదని స్పష్టంగా తెలుస్తోంది. సాగుచేయని భూయజమానులకు పరిహారం ఏ విధంగా ఇస్తారో ప్రభుత్వం చెప్పాల్సి ఉంది. ప్రస్తుతం భూమి ఎవరు సాగుచేశారో వారికి పరిహారం ఇచ్చేవిధంగా ఎన్యూమరేషన్ ప్రక్రియ కొనసాగితేనే కౌలురైతులకు న్యాయం జరిగే పరిస్థితి ఉంటుంది. ప్రభుత్వం భూయజమానులకు మేలు చేసేలా వ్యవహరిస్తోంది. ఇ-క్రాప్‌లో చాలామంది పేర్లు నమోదు కాలేదు. అలాంటి వారికి పరిహారం అందకుండా పోయే పరిస్థితి ఏర్పడింది. అంతేకాకుండా రైతుకు ఐదెకరాల వరకు మాత్రమే పంట నష్టపరిహారం ఇస్తామని ప్రభుత్వం తమ ఆదేశాల్లో పేర్కొన్నట్లు తెలుస్తోంది. చాలామంది రైతులు పది, అంతకుపైగా ఎకరాల్లో పంటను సైతం నష్టపోయారు. దెబ్బతిన్న పంటకు పరిహారం ఇవ్వకుండా ఐదెకరాలకు మాత్రమే అంటూ నిబంధన పెట్టడంపైన విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో కౌలురైతులకు తీరని అన్యాయం జరిగే అవకాశం ఉంది.



ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

కదంతొక్కిన ఆశాలు

కలెక్టరేట్ వద్ద 36 గంటల ధర్నా ప్రారంభం
జిల్లావ్యాప్తంగా తరలివచ్చిన ఆశాలు
ఏలూరులో భారీ ర్యాలీ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించకపోతే జగన్ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి హెచ్చరించారు. ఆశాల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం కలెక్టరేట్ వద్ద చేపట్టిన 36 గంటల ధర్నాను ఆమె ప్రారంభించారు. ఈ ధర్నాలో జిల్లా నలుమూలల నుండి పెద్ద సంఖ్యలో ఆశాలు పాల్గొన్నారు. ముందుగా స్థానిక ఏలూరు జ్యూట్ మిల్లు నుండి ఓవర్ బ్రిడ్జి, ఫైర్ స్టేషన్ సెంటర్, జిల్లా పరిషత్ సెంటర్ మీదుగా ప్రదర్శనగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఆశా వర్కర్లకు సంబంధం లేని పనులు చేయించరాదని, పని భారం తగ్గించాలని గ్రూప్ బీమా సౌకర్యం కల్పించాలని, అధికారుల వేధింపులు ఆపాలని ఆశాలు డిమాండ్ చేశారు. ఈ ధర్నానుద్దేశించి ధనలక్ష్మి మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా తక్షణం వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో మృతిచెందిన ఆశా వర్కర్లకు రూ.10 లక్షల



కలెక్టరేట్ వద్ద వంటా-వార్పు చేస్తున్న అంగన్‌వాడీలు

నష్టపరిహారమివ్వాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.పది వేలు జీతం ఇస్తున్నామనే పేరుతో 14 రకాల యాప్‌లు, 26 రిజిస్టర్లు నిర్వహించాలంటూ విపరీతమైన పనిభారం మోపిందని విమర్శించారు. ఆశా వర్కర్లకు నాణ్యతలేని సెల్‌ఫోన్లు, 2జి సిమ్‌లు ఇచ్చి ఆన్‌లైన్ వర్కులు చేయమంటే ఎలా చేస్తారని ప్రశ్నించారు. లంచాలకు అలవాటు పడిన ఉన్నతాధికారులు నాణ్యతలేని ఫోన్ ఇచ్చి ఆశా వర్కర్లను తీవ్రఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. నెలకు నాలుగు, ఐదు సమావేశాల పేరుతో పిహెచ్‌సిలకు పిలిపించి టిఎ, డిఎ ఇవ్వకుండా ఆశాలను ఆర్థికంగా నష్టపరుస్తున్నారని విమర్శించారు. ఉదయం నుండి సాయంత్రం వరకూ సచివాలయం వద్ద ఉండాలని స్థానిక అధికారులు నిర్బంధించడం బానిసలుగా పనిచేయించడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆశ వర్కర్ల జాబ్‌తో సంబంధం లేని పనులు చెబితే తిరస్కరిస్తామన్నారు. ఎంఎల్‌సి షేక్ సాబ్జీ మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం ఎన్నికల



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న ఎంఎల్‌సి షేక్ సాబ్జీ

ముందు చేసిన హామీలు అమలు చేయకుండా మాటతప్పి, మడమతిప్పారని విమర్శించారు. ఆశాల సమస్యలు తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, ప్రధానకార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ ఆశా వర్కర్లకు పనిభారం పెరిగి బిపి, షుగర్, గుండె జబ్బులు వచ్చి తీవ్రఅనారోగ్య సమస్యలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అకాల మరణం చెందినా, ప్రమాదవశాత్తు మరణించినా ఒక్క రూపాయి కూడా పరిహారం ఇవ్వకుండా ఆశాలను తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పని భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు రోజా, లోకేశ్వరి, కామేశ్వరి, కనకదుర్గ, మేరీ, పావని, పరమేశ్వరి, లలిత, అరుణ, విజయ, నాగ దుర్గ, పావని, నాగమణి, పాతూరి అనూష పాల్గొన్నారు. ధర్నాకు సిఐటియు నగర అధ్యక్ష, కార్యదర్శులు బి.జగన్నాథం, వి.సాయిబాబు, ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జె.గోపి మద్దతు తెలిపారు.

టిడిపి, జనసేన మద్దతు

ఆశాల ధర్నాకు టిడిపి జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, బడేటి చంటి, జనసేన నాయకులు రెడ్డి అప్పలనాయుడు, ఘంటసాల వెంకటలక్ష్మి సంఘీభావం తెలిపి ప్రసంగించారు. జగన్ ప్రభుత్వం అన్యాయంగా ఆశాల సమస్యలు పరిష్కరించకుండా వ్యవహరిస్తుందని విమర్శించారు. తక్షణం వారి సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.



ధర్నా శిబిరంలో నిద్రిస్తున్న అంగన్‌వాడీలు

పంట నష్టపోయిన రైతులను ఆదుకోండి

కలెక్టరేట్ వద్ద అఖిలపక్షం ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మిచౌంగ్ తుపాను ప్రభావంతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని అఖిల పక్షపార్టీలు, ప్రజాసంఘాలు, రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక కలెక్టరేట్ వద్ద నిర్వహించిన ధర్నాలో ఎంఎల్‌సి షేక్ సాబ్జీ, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్, ఎపి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, జనసేన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ మిచౌంగ్ తుపాను వల్ల పంటనష్టపోయిన రైతులను ఆదుకోవాలని, కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా గుర్తించాలని కోరారు. తుపాను ప్రభావంతో వరి, చెరకు, పొగాకు, మినుము, పెసర, పత్తి, మిర్చి, ఉద్యాన పంటలు 60 శాతానికి పైగా దెబ్బతిని పంట చేతికి అందకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణం స్పందించి క్షేత్రస్థాయిలో ఎన్యూమరేషన్ చేపట్టి పంటనష్టాన్ని అంచనావేసి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సాగుకు దూరంగా ఉంటారని, ఆహార ధాన్యాల కొరత ఏర్పడి ఆహార భద్రత ప్రమాదంలో పడే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇక్రాప్‌తో సంబంధం లేకుండా పాత రుణాలను రద్దు చేసి, మళ్లీ నూతనంగా రుణాలు మంజూరు చేసి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. రెండో పంట వేసేందుకు రుణాలు మంజూరు చేసి, విత్తనాలు ఉచితంగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. మొలకెత్తిన ధాన్యాన్ని, పత్తి, మిర్చి పంటలను ఎలాంటి నిబంధన లేకుండా ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు. జాతీయ విపత్తుగా గుర్తించి తక్షణం రూ.వెయ్యి కోట్ల సాయాన్ని అందించాలని డిమాండ్ చేశారు. జనసేన వీర మహిళ ఘంటసాల వెంకటలక్ష్మి, కాంగ్రెస్ పార్టీ నాయకులు దండు బోయిన చంద్రశేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్ పాల్గొన్నారు.





ఏలూరు అర్బన్‌లో...

మోకాళ్లపై అంగన్‌వాడీల నిరసన

మూడో రోజుకు సమ్మె

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కలెక్టరేట్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తల సమ్మె శిబిరాన్ని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సోమయ్య ప్రారంభించి మాట్లాడారు. సమ్మెకు టిడిపి, జనసేన, సిపిఎం, సిపిఐ, పలు ప్రజాసంఘాలు పాల్గొని మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు దుర్గాభవాని, కార్యదర్శి టి.రజిని, సిఐటియు నగర అధ్యక్షుడు బి.జగన్నాధరావు, కార్యదర్శి వి.సాయిబాబు పాల్గొన్నారు. సమ్మె శిబిరాన్ని ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ సందర్శించి మద్దతు తెలిపారు.

లింగపాలెం : అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. చాట్రాయి మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగే సమ్మెకు ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రామకష్ణ మాట్లాడుతూ ఈ సమ్మెకు కార్మిక సంఘాలు, ప్రజాసంఘాలు, రాజకీయపార్టీలు, అభ్యుదయ ప్రజాస్వామ్య వాదుల మద్దతు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డి.దాస్, జ్యోతి, అంగన్‌వాడీ సంఘం నాయకులు బిజిఎన్.కుమారి, ఈశ్వరి, మేరీ మార్తమ్మ పాల్గొన్నారు.

పెదపాడు : అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన సమ్మె పెదపాడులోని బస్టాండ్ సెంటర్‌లో మూడో రోజు కొనసాగింది. అంగన్‌వాడీలు నోట్లో పచ్చగడ్డి, ఎండు గడ్డి పెట్టుకుని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. సమ్మెకు సిపిఎం, ఎపి రైతు సంఘం, ఆవాజ్ నాయకులు మద్దతు తెలిపారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గుండపనేని సురేష్, ముసునూరి కొండలరావు, ఆవాజ్ నాయకులు షేక్ కరిముల్లా, షేక్ బాషా, సిఐటియు మండల కార్యదర్శి రెడ్డి లక్ష్మణరావు, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ పెదపాడు ప్రాజెక్టు అధ్యక్షురాలు ఎస్.తిరుపతమ్మ, కె.శారద, ఎ.దేవమణి, సీతామహాలక్ష్మి, దుర్గ, జ్యోతి, శ్రీకుమారి పాల్గొన్నారు.


జీలుగుమిల్లి : మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తల, ఆయాల న్యాయమైన సమస్యల పరిష్కారానికి చేపట్టిన నిరవధిక సమ్మెలో మూడో రోజు గురువారం కొనసాగింది. మోకాళ్ల మీద నిల్చుని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. అనంతరం జాతీయ రహదారిపై ర్యాలీగా వెళ్లి జగదాంబ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. ఈ సమ్మెకు మద్దతుగా సిపిఎం, జనసేన, సిఐటియు సంఘాలు మద్దతు ప్రకటించాయి. ఈ కార్యక్రమంలో సిఐటియు కార్యదర్శి కొండలరావు, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు నాగమణి, ఎస్తేరు, సరళ, జ్యోతిలక్ష్మి, మణి పాల్గొన్నారు.

బుట్టాయగూడెం : అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ (సిఐటియు), ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టియు) ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిరవధిక సమ్మె మూడో రోజు గురువారం కొనసాగింది. తహశీల్దార్ కార్యాలయం నుంచి నెహ్రూ బొమ్మ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎం.నాగమణి, ఐఎఫ్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు రామ్మోహన్ మాట్లాడారు. సమ్మెకు సిపిఎం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో టి.రామలక్ష్మి, కె.పుష్ప, వి.ఎస్.కృపామణి, భూదేవి, ఆకాశమ్మ, నూర్జహాన్, రామయమ్మ, మారమ్మ మున్ని పాల్గొన్నారు.

చింతలపూడి : అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని రిటైర్డ్ ఐఎఎస్ విజయ్‌కుమార్ అన్నారు. పట్టణంలో ఫైర్‌స్టేషన్ వద్ద అంగన్‌వాడీ టీచర్స్, వర్కర్స్ యునియన్ జెఎసి ఆధ్వర్యంలో జరుగుతున్న సమ్మెకు ఆయన మద్దతు ఇచ్చారు. అంగన్‌వాడీలకు జనసేన పార్టీ మండలాధ్యక్షులు మధుబాబు, టిడిపి చింతలపూడి నియోజకవర్గ మాజీ కన్వీనర్ జగ్గవరపు ముత్తారెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి సోమశేఖర్ మద్దతు తెలిపారు. తమ సమస్యలు పరిష్కరిం చాలని అంగన్‌వాడీలు ఫైర్‌స్టేషన్ వద్ద మోకాళ్లపై నిరసన వ్యక్తం చేశారు.

ద్వారకాతిరుమల : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద గత మూడు రోజుల నుంచి అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ చేస్తున్న ధర్నాలో భాగంగా గురువారం టిడిపి గోపాలపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి మద్దిపాటి వెంకట్రాజు ధర్నాలో పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వెంకట్రాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు తులసి, హైమావతి పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మగడ్డ నరసింహ స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీల నిరవధిక సమ్మెలో మూడో రోజు గురువారం కొనసాగింది. అంగన్‌వాడీలకు ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు



జంగారెడ్డిగూడెంలో...

నిమ్మగడ్డ నరసింహ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సత్తు కోటేశ్వరరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు అన్నమ్మ, అనురాధ, పుల్లమ్మ, కరుణ, రూప, జ్యోతి, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

టి.నరసాపురం : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద మోకాళ్లపై నిలుచుని కళ్లకు నల్ల రిబ్బన్లు ధరించి నిరసన ప్రదర్శన చేశారు. వీరికి ప్రజాసంఘాల నాయకులు మద్దతు తెలిపారు. ఈ సమ్మెలో రైతు సంఘం నాయకులు అనుమోలు మురళి, అంగన్‌వాడీ కార్యకర్తలు బి.పనివర్ధన్, చింతలపూడి అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి కె.మాణిక్యం, జె.కృష్ణవేణి, బి.అరుణ, పిఎల్‌వి.జ్యోతి పాల్గొన్నారు.

నిడమర్రు : నిడమర్రులో మూడో రోజు కొనసాగిన అంగన్‌వాడీ వర్కర్స్ సమ్మెకు జనసేన పార్టీ ఉంగుటూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి పచ్చమట్ల ధర్మరాజు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు హరికుమార్‌రాజు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణరావు, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు విమల, ఆర్.రామలక్ష్మి, ఎన్.నాగేశ్వరి, ఎ.నాగమణి, బి.కుమారి పాల్గొన్నారు.



చింతలపూడిలో...

కొయ్యలగూడెం : కొయ్యలగూడెంలో నిర్వహించిన సమ్మెలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శుక్లబోయిన రాంబాబు మాట్లాడారు. సిపిఎం జిల్లా సెక్రటరీ సభ్యులు మొడియం నాగమణి, రిటైర్మెంట్ ఉద్యోగుల సంఘం మండల కార్యదర్శి నారాయణ, విఆర్‌ఎల సంఘం ప్రెసిడెంట్ కట్టా రవి, ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు రమణరావు, ప్రాజెక్టు అధ్యక్షురాలు శివ రత్నకుమారి, ఎం.మాధవి, పద్మజా, అడపా జ్యోతి, జె.నాగవేణి, శ్రీదేవి, షేక్ నూర్జహాన్ పాల్గొన్నారు.

ఉంగుటూరు : ఉంగుటూరులో అంగన్‌వాడీలు చేపట్టిన నిరసనకు జనసేన ఉంగుటూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ధర్మరాజు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సురేష్, మీసాల హరి, తానేటి జోగేశ్వరరావు, చిన్నం ఆనంద్, టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ముసునూరు : మండలంలోని ముసునూరు గ్రామ సచివాలయంలో అంగన్‌వాడీ సమ్మెకు రాష్ట్ర తెలుగుయువత ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దె రఘుబాబు మద్దతు తెలిపారు. టిడిపి మండల నాయకులు కందుల పిచ్చియ్య, తల్లిబోయిన రాధిక సత్యనారాయణ, కాటేపల్లి సత్యనారాయణ, తోట శ్రీనివాసరావు మద్దతు తెలిపారు. నూజివీడు డివిజన్ అంగన్‌వాడీ సెక్టర్ కార్యదర్శి పల్లిపాము రాజకుమారి, మేరి సులోచన, విద్యావతి, లక్ష్మి, పాల్గొన్నారు.

భీమడోలు : అంగన్ వాడీలు స్థానిక ప్రార్థనాలయంలో విగ్రహానికి వినతిపత్రం అందించారు. అంగన్‌వాడీ యూనియన్ నాయకులు స్వర్ణకుమారి, చెల్లామణి మాట్లాడారు. శిబిరాన్ని జనసేన ఉంగుటూరు నియోజకవర్గ కన్వీనర్ పి.ధర్మరాజు సందర్శించి మద్దతు తెలిపారు.

పోలవరం : అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ మండల కమిటీ ఆధ్వర్యంలో మూడో రోజు గురువారం మోకాళ్ల మీద నిల్చుని నిరసన చేపట్టారు. ఈ సమ్మెకు టిడిపి పోలవరం మాజీ ఎంఎల్‌ఎ మొడియం శ్రీనివాస్ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి పిఎల్‌ఎస్.కుమారి, సిఐటియు జిల్లా కార్యదర్శి పి.భారతి, సముద్రాల సాయికృష్ణ, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ పాల్గొన్నారు.

కలిదిండి : స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మె మూడో రోజూ కొనసాగింది. రాష్ట్రీయ రహదారిపై మానవహారం చేపట్టారు. సిఐటియు మండల కార్యదర్శి జక్కుల మహేష్, ఉపాధ్యక్షులు చిన్నం శ్రీకాంత్, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు షేక్ అబిదా బేగం, జక్కంశెట్టి మేనకలక్ష్మి, కొప్పినీడి రమాదేవి పాల్గొన్నారు. మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్, జనసేన నియోజకవర్గ నాయకులు నల్లగోపుల చలపతిరావు శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు.

జంగారెడ్డిగూడెం : అంగన్‌వాడీల సమ్మెకు టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యాంచంద్రశేషు మద్దతు తెలిపారు. బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి చిట్టిబొయిన రామలింగేశ్వరరావు, కొండ్రెడ్డి కిషోర్, ప్రసాద్, ఆలపాటి నాని, చెరుకూరి శ్రీధర్, ముళ్లపూడి శ్రీనివాస్, గణేష్, కిరణ్, తోట కృపవరం, రాజు, పులపకుల ప్రసాద్ మద్దతు తెలిపారు.

మండవల్లి : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు నిర్వహించిన ధర్నాలో మాజీ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, అంగన్‌వాడీలు, హెల్పర్లు పాల్గొన్నారు.

చాట్రాయి : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు వినూత్న రీతిలో మోకాళ్లపై నిల్చుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు జి.రాజు మాట్లాడారు.

ముదినేపల్లి : స్థానిక గురజ సెంటర్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలు మానవహారం నిర్వహించారు. మాజీమంత్రి కామినేని శ్రీనివాస్, టిడిపి నాయకులు చల్లగుల్లశ్ శోభనాద్రి చౌదరి, బొంగు రవికుమార్, సిపిఎం నాయకులు మహంకాళిరావు, చిన్నం మాధవ అంగన్వాడి కార్యకర్తలను కలిసి తమ సంపూర్ణ మద్దతు తెలిపారు.

తాళాలు పగులకొట్టిన అధికారులు

పోలవరం : మూడు రోజులుగా అంగన్‌వాడీలు తమ కోర్కెల సాధనకు సమ్మె చేస్తున్న నేపథ్యంలో చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం అందకపోవడంతో అవస్థలు పడుతున్నారని ఎంపిడిఒ జి.శ్రీను అన్నారు. జిల్లా స్త్రీ శిశుసంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ఆదేశాల మేరకు గురువారం కొత్త పట్టిసీమ, గూటాల గ్రామాల్లో నాలుగు అంగన్‌వాడీ సెంటర్ల తాళాలు బద్దలు కొట్టి వాటి స్థానాల్లో కొత్త తాళాలు వేయించినట్లు ఎంపిడిఒ తెలిపారు. అంగన్‌వాడీ సెంటర్లలో పౌష్టికాహారం నిల్వలు పరిశీలించి తాళాలు, స్టాకు మహిళా పోలీసులకు అప్పగించారని, మహిళా పోలీసుల ఆధ్వర్యంలో గ్రామ వాలంటీర్లు గర్భిణులకు, బాలింతలకు, శిశువులకు వంటలు వండి పోషకాహారం అందిస్తారని అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు రాణి, మాధవి తెలిపారు. మండలంలో మిగిలిన అంగన్‌వాడీ సెంటర్లలో కూడా ఇదేవిధంగా ఏర్పాటు చేయనున్నట్లు ఎంపిడిఒ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, ఐసిడిఎస్ సిడిపిఓ శ్రీనివాసరావు తెలిపారు.

జంగారెడ్డిగూడెం : లక్కవరం గ్రామ సర్పంచి ఎల్లా వెంకటరమణ సమక్షంలో మహిళా పోలీస్, ప్రభుత్వాధికారులు అంగన్‌వాడీ కేంద్రానికి వేసి ఉన్న తాళాలను పగులకొట్టారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు, మహిళా పోలీస్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగలకొట్టడం సరికాదు

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్

ఏలూరు అర్బన్ : అంగన్‌వాడీ సమ్మెను విఫలం చేసేందుకు అంగన్వాడీ కేంద్రాల తాళాలు బద్దలు కొట్టి సెంటర్లు తెరిపించే ప్రయత్నం చేయడం పట్ల సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గురువారం అనేక మండలాల్లో అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు, తలుపులు బద్దలు కొట్టారన్నారు. జిల్లా ఉన్నతాధికారులే స్వయంగా తాళాలు బద్దలు కొట్టమని ఆదేశాలు ఇవ్వడం చట్టాన్ని ఉల్లంఘించమని ప్రోత్సహించడమేనన్నారు. సచివాలయ సిబ్బంది, ఇతర సిబ్బందిని బలవంతంగా బెదిరించి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు ఉసిగొల్పడం దారుణమన్నారు. జగన్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలు తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లేకపోతే నిరవధిక సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

వైసిపి విద్యార్థి విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా భరత్‌రెడ్డి

పజాశకి - చింతలపూడి

వైసిపి విద్యార్థి విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా చింతలపూడి మండలనికి చెందిన సింగిరెడ్డి భరత్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

చింతలపూడికి ఐక్యత విజయపథం పాదయాత్ర

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి నగరపంచాయతీ అప్‌గ్రేడ్ చేసినట్లు రిటైర్డ్ ఐఎఎస్ విజయ్‌కుమార్ తెలిపారు. పట్టణంలో ఐక్యత విజయ పథం పాదయాత్ర గురువారం చింతలపూడికి చేరుకుంది. తొలుత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాలంటీర్, సచివాలయ వ్యవస్థను రూపకల్పన చేసి, ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావు, భాను, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

4న బాలోత్సవ్


ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

వచ్చే నెల నాలుగో తేదీన నిర్వహించే బాలోత్సవ్ కరపత్రాలను స్థానిక విద్యావికాస్ విద్యాసంస్థల ప్రాంగణంలో ఆవిష్కరించారు. స్థానిక బాలోత్సవ్ గౌరవ అధ్యక్షులు అయినాల వెంకటరమణమూర్తి అధ్యక్షతన నిర్వహించిన కరపత్రం ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సిటీ కేబుల్ ఎండి పాలపర్తి శ్రీనివాస్, విద్యావికాస్ విద్యాసంస్థల కరస్పాండెట్ పి.సతీష్‌చంద్, డైరెక్టర్ వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలోత్సవ్ జిల్లా సెక్రటరీ నరసింహరావు మాట్లాడుతూ కార్యక్రమాన్ని అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛంద సంస్థలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

16న విజయ దివస్

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఈ నెల 16వ తేదీ శనివారం విజయ్ దివస్ (1971 ఇండో పాక్ వార్ ఫర్ లిబరేషన్ ఆఫ్ బంగ్లాదేశ్) సందర్భంగా ఏలూరు జిల్లా ఎక్స్-సర్వీస్‌మెన్ అసోసియేషన్, కోటదిబ్బలోని అమర్ జవాన్ స్తూపం వద్ద దేశం కోసం ప్రాణాలర్పించిన వీర సైనికులకు ఘన నివాళులర్పిస్తున్నట్లు జిల్లా ఎక్స్-సర్వీస్‌మెన్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ సైనికులు వీర నారీలు, ఏలూరు పౌరులందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.



భోజనం చేస్తున్న విద్యార్థులు

విద్యార్థులకు భోజనాలు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

పట్టణానికి చెందిన ఫ్రెండ్స్ అసోసియేషన్ సంస్థ సభ్యులు ఏలూరు శనివారపుపేటలోని పరివర్తన్ బధిరుల పాఠశాలకు చెందిన విద్యార్థులకు గురువారం మధ్యాహ్నం భోజనం అందించారు. ఫ్రెండ్స్ అసోసియేషన్ ప్రతినిధి ఎస్.సురేష్‌కుమార్ మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో ప్రతి నెల వృద్ధాశ్రమం, అనాథ పిల్లలకు భోజన సౌకర్యం, దుస్తులు, దుప్పట్లు పంపిణీ, నిరుపేదలైన విద్యార్థులకు ఆర్థిక సహాయం వంటి పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందుకు సహకరిస్తున్న తమ సంస్థ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయి అరవింద్ రెడ్డి, పార్థసారథి రెడ్డి పాల్గొన్నారు.

పాలసానిపల్లిలో 'మీ ఓటు మీ బాధ్యత'

ప్రజాశక్తి - భీమడోలు



ఇవిఎం పనితీరు పరిశీలిస్తున్న సర్పంచి

పాలసానివల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో మీ ఓటు మీ బాధ్యత (స్వీప్) కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి గ్రామ సర్పంచి షేక్ రహీమా బేగం హసేన అధ్యక్షత వహించారు. ఉదయం గ్రామ పరిధిలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఎంపిడిఒ సిహెచ్.పద్మావతి దేవి, తహ శీల్దార్ స్వీప్ కార్యక్రమ లక్ష్యాలను వివరించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారులు సింహాచలం, సాల్మన్‌రాజు, షేక్ ఇంతియాఫ్ ఇవిఎం, వివి ప్యాట్ యంత్రాల వినియోగం గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు ఎ.దేవీనాగేంద్రప్రసాద్, పంచాయతీ కార్యాలయ సిబ్బంది, అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ముసునూరు

రోడ్డు ప్రమాదంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన ముసునూరు మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... నూజివీడు మండలం ముక్కోలుపాడు గ్రామానికి చెందిన కోరు ఏసుబాబు (45) గురువారం సాయంత్రం ముక్కోలుపాడు గ్రామం నుంచి ముసునూరు మీదుగా ఏలూరు బయలుదేరాడు. ఈ క్రమంలో ముసునూరు వద్దకు వచ్చేసరికి రోడ్డుపై గుంతల కారణంగా బైక్ అదుపుతప్పడంతో కింద పడి తీవ్ర గాయాలపాలయ్యారు. తలకు బలమైన గాయం కావడంతో మృతి చెందాడు. మృతునికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.


ఆలయంలో చోరీ

ఏలూరు స్పోర్ట్స్: శివాలయంలో దొంగలు చోరీకి పాల్పడి నగదు దోచుకుపోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు వన్‌టౌన్ పరిధిలోని బావిశెట్టివారిపేట నల్లదిబ్బ సమీపంలోని శివాలయంలో బుధవారం రాత్రి దొంగలు ఆలయం గేటు తాళాలు పగులకొట్టి లోపలికి చొరబడ్డారు. హుండీ పగులకొట్టి హుండీలోని నగదును, కార్తీకమాసం సందర్భంగా ఆలయంలో ఉంచిన కొంత నగదును దోచుకుపోయారు. దీనిపై ఆలయ పూజారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం రాత్రి వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఇప్పుడు సేకరిస్తే.. కొనేదెప్పుడు..!

రంగుమారిన ధాన్యం శాంపిల్స్ సేకరణలో కేంద్రబృందం హడావుడి

రెండుజిల్లాల్లోనూ పర్యటన



ఉంగుటూరు మండలం కైకరంలో ధాన్యం పరిశీలిస్తున్న బృందం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

తడిసిన రంగుమారిన ధాన్యం సేకరణకు సంబంధించి కేంద్ర ఆధ్వర్యంలోని పౌరసరఫరాలశాఖ బృందం చేస్తున్న హడావుడి చూసి అంతా నివ్వెరపోతున్నారు. రంగుమారిన ధాన్యం శాంపిల్స్ ఇప్పుడు సేకరిస్తే కొనుగోలుకు ఎప్పటికీ ఆదేశాలిస్తారంటూ రైతులు తీవ్ర ఆసహనానికి గురవుతున్నారు. ఐజిఎంఆర్ఐ టెక్నికల్ ఆఫీసర్ డాక్టర్ బాసంత్ ఆధ్వర్యంలోని పౌరసరఫరాలశాఖకు చెందిన కేంద్ర బృందం ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో గురువారం పర్యటించింది. పశ్చిమలో ఉండి, కాళ్ల, పాలకోడేరు, వీరవాసరంతోపాటు పలు మండలాల్లో పర్యటించిన బృందం సాయంత్రం ఆరుగంటల తర్వాత ఏలూరు జిల్లాలోని ఉంగుటూరు మండలం కైకరం చేరుకుని అక్కడ ధాన్యం శాంపిల్స్‌ను సేకరించింది. మిచౌంగ్ తుపానుమ దెబ్బకు రెండుజిల్లాల్లోనూ పెద్దఎత్తున పంట నష్టం జరిగింది. ముఖ్యంగా వరిపంటకు ఎక్కువ నష్టం వాటిల్లింది. ప్రాథమిక అంచనాల ప్రకారం ఏలూరు జిల్లాలో 85వేల ఎకరాలు, పశ్చిమలో 68వేల ఎకరాల వరకూ పంటనష్టం జరిగినట్లు లెక్కగట్టారు. ప్రస్తుతం పూర్తిస్థాయి లెక్కలకు సంబంధించి ఎన్యూమరేషన్ ప్రక్రియ సాగుతోంది. తుపాను దెబ్బకు పంటలు నేలకొరగడంతో రోజుల తరబడి నీటిలో నానుతున్న పరిస్థితి నెలకొంది. దీంతో ధాన్యం రంగుమారడంతోపాటు, మొలకలు వస్తున్నాయి. రంగుమారిన ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం ఇప్పటి వరకూ ఆదేశాలివ్వలేదు. ఇప్పటికే చాలా ధాన్యం రైతులు అయినకాడికి అమ్ముకున్నారు. దాళ్వా నారుమడులు వెంటనే వేయాల్సి ఉండటంతో రైతులు వేగంగా ఖరీఫ్ మాసూలు పూర్తిచేసేందుకు దిగారు. రెండుజిల్లాల్లో పెద్దఎత్తున మాసూళ్లు సాగుతున్నాయి. వెంటనే ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంది. తాపీగా ఇప్పుడు వచ్చి రంగుమారిన ధాన్యం శాంపిల్స్ సేకరిస్తున్నారు. ఎప్పటికి రంగుమారిన ధాన్యం కొనుగోలుకు ఆదేశాలు జారీచేస్తారో తెలియడం లేదు. మారో వారం, పదిరోజుల్లో ఖరీఫ్ మాసూలు పూర్తయ్యే అవకాశం ఉంది. తాపీగా రంగుమారిన ధాన్యంకొనుగోలుకు సంబంధించి ప్రభుత్వం ఆదేశాలు జారీచేసినప్పటికీ రైతులకు పెద్దగా ప్రయోజనం ఉండదని తెలుస్తోంది. ఒకటి, రెండురోజుల్లో ఆదేశాలు జారీచేస్తేనే ప్రయోజనం ఉంటుంది. లేకపోతే రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుంది.

ఇంధన పొదుపు అందరి బాధ్యత

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్



ఇంధన పొదుపు వారోత్సవాలను ప్రారంభిస్తున్న జెసి లావణ్యవేణి

ఇంధన పొదుపు అందరి బాధ్యత అని, ఇంధనాన్ని ఆదా చేయడంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి పిలుపునిచ్చారు. ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకూ జిల్లావ్యాప్తంగా విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం కలెక్టరేట్ వద్ద జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఇంధన పొదుపు ఆవశ్యకతపై ప్రజలను చైతన్యపరిచేందుకు నిర్వహించిన ర్యాలీని జెండా ఊపి జెసి ప్రారంభించారు. కలెక్టరేట్ నుంచి ఆర్ఆర్.పేటలోని విద్యుత్ సౌధ భవనం కూడలి వరకూ నిర్వహించిన ఈ ర్యాలీలో విద్యార్థులు, విద్యుత్ ఉద్యోగులు, వినియోగదారుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు ఇంధన పొదుపు అంశంపై 20వ తేదీ వరకూ రోజుకు ఒక అంశంపై కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీటిలో పెయింటింగ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజల్లో ఇంధన పొదుపుపై అవగాహన పెంపొందించే దుకు ఈ ఉత్సవాలు దోహదపడతాయన్నారు. అవసరం మేరకు మాత్రమే విద్యుత్‌ను వినియోగించాలని, ఎల్ఇడి బల్బుల వినియోగం వల్ల విద్యుత్ ఆదా అవుతుందని, అందుకే ఈ బల్బుల వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఇళ్లలో వీలైనంత వరకు విద్యుత్‌ను ఆదా చేసే స్టార్ రేటెడ్ ఉపకరణాలను ఉపయోగించాలన్నారు. సుస్థిర భవిష్యత్ కోసం ఇంధన పొదుపు అత్యవసరమని, భావితరాల భద్రత కోసం ఇంధనాన్ని పొదుపుగా ఉపయోగించాల్సిన అవసరముందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని జెసి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఎస్ఇ సాల్మన్ రాజు, డిఇలు, ఎఇలు, విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉద్యోగులు బాధ్యతాయుతంగా ఉండాలి

చాట్రాయి మండల సమావేశంలో ఎంపిపి నిర్మల



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి నిర్మల

ప్రజాశక్తి - చాట్రాయి

ఉద్యోగులు బాధ్యతాయుతంగా నడుచుకోవాలని ఎంపిపి లంక నిర్మల చెప్పారు. స్థానిక మండల ప్రజా పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపిడిఒ కె.దుర్గాప్రసాద్ అధ్యక్షత వహించగా గ్రామ సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, జెడ్‌పిటిసి సభ్యులు, చెలికాని అనూష, ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు. రాష్ట్ర కో-ఆపరేటివ్ యూనియన్ ఛైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తుందన్నారు. జనార్ధనవరం ఎంపిటిసి సభ్యులు పోతిరెడ్డిపల్లి కృష్ణ మాట్లాడుతూ రీ సర్వే చేసిన భూముల్లో అవకతవకలు జరిగాయన్నారు.తప్పుల తడకగా సర్వే ఉందని, ఒకరి భూములకు వేరే నెంబర్లు ఉన్నాయని, వీటిని సరిచేయాలని అడిగిన రైతులకు గ్రామ సర్వేయర్ సరైన సమాధానం చెప్పట్లేదన్నారు. మళ్లీ సర్వే చేయాలంటే ఎకరానికి రూ.పది వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారన్నారు. కృష్ణారావుపాలెం ఎంపిటిసి సభ్యులు చింతగుంట్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉద్యోగులకు ప్రజాప్రతినిధులు ఫోన్ చేస్తే సరైన సమాధానం చెప్పడంలేదన్నారు. ఎంపిపి నిర్మల మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికే ప్రజా ప్రతినిధులు, ఉద్యోగులు ఉన్నారన్నారు. ప్రజాప్రతినిధులు అయిన తాము ఫోన్ చేస్తే అధికారులు ఎందుకు ఫోన్ ఎత్తి సమాధానం చెప్పరని, అలాంటివారిని ఉద్యోగం నుంచి తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒకు తెలిపారు. చిత్తపూరు గ్రామ సర్పంచి తిరువీధి రమేష్ మాట్లాడుతూ ఎస్‌సి సామాజిక తరగతికి చెందిన చర్మకారుల, డప్పు కళాకారుల పెన్షన్లు పెట్టుకున్నా అర్హులైన లబ్ధిదారులకు ఎందుకు మంజూరు చేయట్లేదని, 800 పైగా అర్జీలు ఉన్నా ఒక్కటి కూడా మంజూరు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

'ఆడుదాం ఆంధ్రా' నిర్వహణ తేదీలు మార్పు

ప్రజాశక్తి - భీమడోలు

ఆడుదాం ఆంధ్రా కార్యక్రమ నిర్వహణ తేదీలు మారినట్లు భీమడోలు ఎంపిడిఒ సిహెచ్.పద్మావతిదేవి తెలిపారు. గ్రామ సచివాలయ స్థాయిలో క్రీడల్లో పాల్గొనే ఆసక్తి గల 15 నుంచి 40 సంవత్సరాల మధ్యగలవారు తమ పేర్లను నమోదు చేయించుకున్న తర్వాత గ్రామస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనాల్సి ఉంది. గ్రామస్థాయిలో క్రీడా మైదానాలు అందుబాటులో లేనందు వల్ల సమీపంలోని ఉన్నత పాఠశాలలో క్రీడా పోటీలు నిర్వహించేందుకు సన్నాహాలు చేశారు. భీమడోలు మండల పరిధిలోని 17 గ్రామ సచివాలయాల నుంచి 2877 మంది క్రీడాకారులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. వీరిలో 873 మంది మహిళా క్రీడాకారులు ఉండటం విశేషం. వీరి కోసం క్రికెట్, బాల్ బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో ఆటలను నిర్వహించేందుకు సన్నాహాలు చేశారు. ఈ నేపథ్యంలో క్రీడాకారులు తమ గ్రామాలకు సమీపంలోని పూళ్ల, గుండుగొలను, భీమడోలు, ఆగడాలలంక హై స్కూల్లో అందుబాటులో ఉన్న క్రీడా మైదానాల సేవలను వినియోగించుకోవాల్సి ఉంది. షెడ్యూల్ మేరకు ఈ నెల 15 నుంచి 20వ తేదీ వరకు గ్రామస్థాయి పోటీలను నిర్వహించాల్సి ఉంది. అనంతరం డిసెంబర్ 21వ తేదీ నుంచి వచ్చే సంవత్సరం జనవరి మూడో తేదీ లోపు మండల స్థాయి క్రీడా పోటీలు భీమడోలు హై స్కూల్ కేంద్రంగా నిర్వహించాల్సి ఉంది. పోటీల నిర్వహణకు చేసిన ఏర్పాట్లను ఎంపిడిఒ పరిశీలించేందుకు గుండుగొలను, భీమడోలు హై స్కూళ్లను సందర్శించారు. అక్కడి పాఠశాల యజమాన్యాలతో కార్యక్రమ నిర్వహణపై మాట్లాడారు. క్రీడాకారుల కోసం వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని గుండుగొలను, పూళ్ల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వారిని కోరారు. ఈలోగా ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావటంతో గ్రామస్థాయిలో ఈ నెల 26వ తేదీ నుంచి ప్రారంభిం చనున్నట్లు తెలిపారు.

ముసునూరు : ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలకు రిజిస్ట్రేషన్ గడువు ఈ నెల 17వ తేదీ వరకు పొడిగించినట్లు ఎంపిడిఒ జి.రాణి తెలిపారు. 15వ తేదీన జరగనున్న ఆటల పోటీలు ఈ నెల 26వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు తెలిపారు.

మాదక ద్రవ్యాల రవాణాపై నిఘా

డిఐజి అశోక్ కుమార్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మాదకద్రవ్యాల రవాణాను పూర్తిగా నివారించేందుకు నిఘా వ్యవస్థను పటిష్టం చేశామని ఏలూరు రేంజ్ డిఐజి అశోక్ కుమార్ తెలిపారు. గురువారం జంగారెడ్డిగూడెం డిఎస్‌పి కార్యాలయంలో పలు రికార్డులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏలూరు రేంజ్‌లో మాదక ద్రవ్యాల రవాణా గతంతో పోల్చుకుంటే బాగా తగ్గిందన్నారు. పూర్తిగా అరికట్టే చర్యలు చేపడుతున్నామని తెలిపారు. పండుగల నేపథ్యంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శాంతిభద్రతలు కాపాడేందుకు కృషి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

మూడో పట్టణ పరిధిలో శాంతిభద్రతలను పూర్తిస్థాయిలో కాపాడేందుకు కృషి చేస్తానని మూడో పట్టణ సిఐ వెంకటేశ్వరరావు తెలిపారు. నగరంలోని మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో నూతన సిఐగా ఆయన గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. 2012 బ్యాచ్‌కు చెందిన వెంకటేశ్వరరావు ఎస్ఐగా పోలీసు శాఖలో ఉద్యోగం బాధ్యతలు స్వీకరించారు. తెలంగాణలో కొంతకాలం ఉద్యోగం నిర్వహించిన అనంతరం మొట్టమొదటిగా ఆంధ్రప్రదేశ్‌లో పాలకోడేరు, చేబ్రోలు, ఉండి, ఏలూరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లలో ఆయన ఎస్ఐగా పని చేశారు. 2016లో సిఐగా ఉద్యోగోన్నతి పొందారు. అనంతరం ఆయన విజయవాడ ఇంటెలిజెన్స్ గణపవరం పోలీస్ స్టేషన్లలో సిఐగా పని చేశారు. భీమడోలు సిఐగా పనిచేసిన అనంతరం ఆయన ఏలూరు మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన ఉన్నతాధికారులను మర్యాదపూర్వకంగా కలిశారు.

పంటలు పరిశీలన

ప్రజాశక్తి - మండవల్లి

తుపాను ప్రభావంతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం పట్టించుకోవడంలేదని మాజీ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ విమర్శించారు. మండలంలోని పెరిగేగూడెంలో తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు నీట మునిగిన పొలాలను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులను విస్మరించిందనడానికి కౌలు రైతు మృతి చెందటమే నిదర్శనమన్నారు. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మిచౌంగ్ తుపాను ప్రభావంతో పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.లక్ష పంట నష్ట పరిహారం అందించాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొరగం శ్రీనివాసులు అన్నారు. బుట్టాయగూడెం పార్టీ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన పార్టీ మండల అధ్యక్షులు, అనుబంధ విభాగాలు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బొరగం మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీన జాతీయ ప్రధాన కార్యదర్శి, నారా లోకేష్ యువగళం పాదయాత్ర ముగింపు సభకు నియోజకవర్గం నుంచి భారీగా హాజరవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పారేపల్లి రామారావు, పార్టీ మండల అధ్యక్షులు మొగపర్తి సొంబాబు, పారేపల్లి నరేష్, నాయుడు రామకృష్ణారావు గౌడ్, ఏలూరు పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ యంత్రప్రగడ శ్రీనివాస్, జిల్లా తెలుగు రైతు కార్యదర్శి గద్దె అబ్బులు, ఎస్‌టి సెల్ రాష్ట్ర కార్యదర్శి సున్నం నాగేశ్వరరావు, జిల్లా అధికార ప్రతినిధి జారం చాందిని విద్యాసాగరిక, పార్లమెంట్ తెలుగు మహిళా అధ్యక్షురాలు చింతల వెంకటరమణ పాల్గొన్నారు.

పెయ్యేరులో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని పెయ్యేరులో ఇఒపిఆర్‌డి దూలం లక్ష్మీనారాయణ అధ్యక్షతన గురువారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర జరిగింది. ఈ సందర్భంగా బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణ మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ ద్వారా రూ.5 లక్షల ఆరోగ్య బీమా, ఉచిత రేషన్, జలజీవన్ మిషన్ ద్వారా ఉచిత నీటి కుళాయిలకు పెయ్యేరు పంచాయతీకి రూ.98 లక్షల నిధులు కేంద్ర ప్రభుత్వం వచ్చిందన్నారు. ఉచిత గ్యాస్ కనెక్షన్లు, ఉచిత రేషన్, పిఎం కిసాన్ ద్వారా రైతులకు రూ.ఆరు వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. విశ్వకర్మ యోజన పథకం అమలులో ఉన్నందున అర్హులైన చేతి వృత్తులు వారు నమోదు చేసుకుని కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న లబ్ధి పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి అల్లు సుశీల, జాస్తి చంటిబాబు, గండి రామారావు, ఎంపిటిసి సభ్యులు కె.ప్రవీణ్, మండల అధ్యక్షురాలు సత్యవోలు నాగలక్ష్మి, మండల ప్రధాన కార్యదర్శి కొల్లిపర నాగరాజు, ఫణి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

భూహక్కు చట్టం రద్దు చేయాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిల్ యాక్ట్ 2022ను రద్దు చేయాలని జంగారెడ్డిగూడెం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు అచ్యుత శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక చట్టాలు న్యాయ వ్యవస్థను నిర్వీర్యం చేసేలా ఉన్నాయన్నారు. ఇటువంటి రాజ్యాంగ విరుద్ధమైన చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జంగారెడ్డిగూడెం తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు తల్లాడి అశోక్‌కుమార్, ఎవివి.భువనేశ్వరి, మానికల సూరిబాబు, విత్తనాల రత్నరాజు, జివివిఆర్.శేఖర్, మాడ రామమోహనరావు, సిహెచ్‌డివి.కోటేశ్వరరావు, మాంద్రు మోహనరావు, మాదేపల్లి క్రాంతికుమార్, బాషా శ్యాంబాబు, వింజమూరి కిషోర్, దగ్గు కృష్ణ, బల్లే సాయికుమారి, కట్టా రాజీవ్‌కుమారి పాల్గొన్నారు.

ఆపన్నులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - చింతలపూడి

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే నిజమైన మానవత్వమని టిడిపి చింతలపూడి నియోజకవర్గ యువనాయకులు సొంగా రోషన్‌కుమార్ అన్నారు. మండలంలోని ఫాతిమాపురంలో పనికి వెళ్లి విద్యుదాఘాతానికి గురైన అభిలాష్‌ను పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతలు కూడా ఆయనను ఆదుకోవాలన్నారు.